క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

అచ్చంపేట రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. పోలీస్‌శాఖ, లయన్స్‌క్లబ్ అచ్చంపేట సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభిస్తారని తెలిపారు. యువకులు, రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం..

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, డైరెక్టర్లు, రైతులు హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ పరికరాలు పంపిణీ



అచ్చంపేటరూరల్: మండలంలోని సింగారం, ఐనోల్ గ్రామాల్లో ఆదివారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. చార్జింగ్ స్ప్రే పంపులు, పొలాల్లోని పురుగులు, దోమల నివారణకు పిచికారీ చేసే సోలార్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌డీఓ లింగస్వామియాదవ్ మాట్లాడుతూ అచ్చంపేట మండలాన్ని తమ సంస్థ దత్తత తీసుకుందన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని, రసాయన ఎరువుల, పురుగుల మందులను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఎఫ్ చరణ్, సింగారం ఉమ్మడి గ్రామ పంచాయతీ ట్రైనర్ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఎల్లికల్ రోడ్డులో పెట్రోలింగ్ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లుగా ఎస్‌ఐ మాధవరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని సుద్ధకల్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తికి చెందిన ట్రాక్టర్‌గా విచారణలో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే మాలల ఆత్మగౌరవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివారం ఆ సంఘం నాయకులు కోరారు. ఆదివారం ఉప్పునుంతల మండల కేంద్రంలో మాలమహానాడు మండల స్థాయి ఆత్మగౌరవ సభ సన్నాహక సమావేశానికి అచ్చంపేట డివిజన్ ప్రచార కార్యదర్శి కుంద అంజనేయులు హాజరయ్యారు. కోడేరు, మన్ననూరు, వెల్దండలో ఆ సంఘం నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప్పునుంతలలో మండల కమిటీని ఏర్పాటు చేశారు. మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్, దాసు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను కాపాడుకుందాం

మన్ననూర్: దేవాలయాలను కాపాడుకుందామని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్ సమీపంలో ముత్యాలమ్మ దేవత ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. దీనికి నిరసనగా రాత్రి మన్ననూర్‌లోని పలు కాలనీలలో ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, హిందూవాహిని సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



తాడూరు: మండల కేంద్రమైన పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం సైబర్ నేరాల పై ఎస్‌ఎస్‌ఓ బాలకిష్టయ్యగౌడ్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఇతర సమాచారం గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పొద్దన్నారు. కొత్తగా వచ్చే నంబర్‌ను లిఫ్ట్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



కొల్లాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



పెంట్లవెల్లిలో పాత బస్టాండ్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన



కల్వకుర్తిలో..



తెలకపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: వానాకాలం పంటకు రైతుభరోసా నిధులు ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు నిరసన చేపట్టారు. కొల్లాపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ గేట్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకో, ధర్నాలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని మాట్లాడారు. నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఉప్పునుంత మండలం మర్రిపల్లిలో రైతు వేదిక వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. పెంట్లవెల్లిలోని పాత బస్టాండ్‌లో రోడ్డుపై బైఠాయించారు. వెల్దండలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలకపల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. లింగాల, పెద్దకొత్తపల్లి, పదర, బల్మూరు మండలాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు.

సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం మెరుగు

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తిరూరల్: సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం మెరుగు అవుతోందని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం చంద్రోదయం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితలు, సాహిత్యం, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాతాయన్నారు. అనంతరం పుస్తక రచయిత అల్వాల లక్ష్మణమూర్తిని సమితి సభ్యులు, వైదిక బ్రాహ్మణ పరిషత్, పలువురు కవులు సన్మానించారు. కార్యక్రమంలో అర్షభారతి సమితి అధ్యక్షుడు రామశర్మ, ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, కవులు రుక్మాంగద రెడ్డి, యాదగిరాచారి, మల్లయ్య, సుధాకర్, అంజనయ్య, రఘురాములు గౌడ్, శ్రీనయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కల్వకుర్తి: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల పూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివిన 1995–96 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక దగ్గరకు చేరుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చారకొండ: మండలంలోని గోకారంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జక్కుల పెద్దమ్మ కుటుంబ సభ్యులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. సోమవారం నిర్వహించనున్న దశదిన కర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర యువనాయకులు ఆశాదీప్ రెడ్డి సమకూర్చిన డబ్బులను స్థానిక నాయకులు రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాస్కర్ రెడ్డి,నాయకులు కొండల్,గ్రామస్తులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా గ్రామంలో మృతి చెందిన పంజుగుల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, పగడాల అంజనేయులు, మాజీ ఎంపీటీసీ గోపిడి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 20 వేల నగదును ఆర్థికసాయం అందించారు. నాయకులు పరుశురాములు, బ్రహ్మచారి, తిరుపతయ్య, యువకులు సాయి, అనిల్ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: ఇటీవల దూమర్ల లక్ష్మయ్య మృతిచెందడంతో తోటి మిత్రులు బాధిత కుటుంబసభ్యులకు రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు.



ఎస్‌బీఐ చైర్మన్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా నియామకమైన చల్లా శ్రీనివాస్‌ను పట్టణానికి రాష్ట్ర సీఏ ఫోరం అధ్యక్షుడు కల్మిచర్ల విజయ్‌కుమార్, వాసవీ సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పూరిసురేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో సమావేశంలో చైర్మన్‌ను సన్మానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అనంత వెంకటరమణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి



కోడేరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని కోడేరు, పస్పుల, బావాయిపల్లి, జనుంపల్లి, తీగలపల్లి తదితర గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. కూలీల చేత వరి పంటను పైకి లేపి తాళ్లు కడుతున్నారు. అదేవిధంగా మినుములు, వేరుశనగ పంటలు నష్టపోయాయని రైతులు వాపోయారు. అధికారులు పంటలకు పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు వినతి



వెల్దండ: మండలంలోని బైరాపూర్– కలకొండ గ్రామాలకు బీటీరోడ్డును మంజూరు చేయాలని ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి బైరాపూర్ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి బీటీరోడ్డు లేకపోవడంతో కలకొండ, ఆమనగల్లు గ్రామాలకు వెళ్లాడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీటీరోడ్డు మంజూరు చేసి ఆమనగల్లు, కలకొండ, బైరాపూర్ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, మల్లేష్, పెద్దజంగయ్య, సాయితిరుమల, రాములమ్మ, చంద్రమ్మ, ఎల్లమ్మ, గిరిప్రసాద్, నర్సింహ్మ, రవి, సత్యం తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అనుచిత వాఖ్యలు సరికాదని మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. బోగస్ విద్యాసంస్థలను ఎమ్మెల్యే ఏర్పాటు చేసి ఎమ్మెల్యే రియల్ వ్యాపారాన్ని చేస్తున్నారని జైపాల్‌యాదవ్ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. కౌన్సిలర్లు లక్ష్మీ రాంరెడ్డి, బాలు నాయక్, శ్రీను, ఎజాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సమత నాలెడ్జ్ సెంటర్ ప్రారంభం



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో ఆదివారం సమత నాలెడ్జ్ సెంటర్‌ను డీఆర్‌డీఓ రిటైర్డ్ సైంటిస్టులు రాజేశ్వర్ రావు, సాయిబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం సాంకేతిక పరిజ్ఞానం, ఇంటర్‌నెట్, కంప్యూటర్ సౌకర్యాలను ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. సెంటర్ నిర్వాహకుడు కిషోర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వినయ్‌కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



కల్వకుర్తి టౌన్: ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దామని ఐసీటీసీ కౌన్సిలర్ లింగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎయిడ్స్‌పై వలంటీర్లతో కలిసి అవగాహన కల్పించారు. మొబైల్ వ్యాన్ల ద్వారా అవగాహన కల్పిస్తూ, అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేటర్లు విజయలక్ష్మి, చెన్నమ్మలు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా శ్రీనివాసులు



బిజినేపల్లి: మండల ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వట్టెం వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శాంతిభద్రతలకు కట్టుబడి పనిచేస్తానని వివరించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

నాగర్‌కర్నూల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను ఆదివారం కమిషనర్ రాతపూర్వక హామీతో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ 2021 నుంచి కార్మికులకు రావాల్సిన పెండింగ్ ఏరియర్స్ రూ.43600 లతోపాటు జనవరి నుంచి పెంచిన వేతనాలను సకాలంలో గడువులోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మళ్లీ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఒక రోజు పనికి రాకపోతే సూపర్‌వైజర్‌లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఆఫీసులో తండ్రి, కొడుకులు ఇద్దరు వేతనాల చెల్లింపులో దోపిడీకి పాల్పడుతున్నారని కార్మికులను బెదిరించే పనిలో నిమగ్నం అయ్యారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఐద్వా కార్యదర్శి కందికొండ గీత, కావలి శ్రీను, నిజాముద్దీన్, కార్మికులు శేఖర్, భీముడు, రమేష్, సుభాష్, ఎల్లమ్మ, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న పర్వతాలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా 50 శాతం మాత్రమే రుణమాఫీ అయ్యిందన్నారు. అనంతరం మండల బాధ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దేశ్యా నాయక్, శంకర్‌నాయక్, మల్లేష్, సైదులు, మల్లేష్, శివకుమార్, రాములు, నిర్మలమ్మ, వెంకటయ్య, బక్కయ్య, వాల్యానాయక్ పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సభ్యుడి నియామకంపై హర్షం



పుష్పగుచ్ఛం అందిస్తున్న లస్కర్ నాయక్

చారకొండ: రాష్ట్ర సాధనలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమ నాయకుడిగా పని చేసిన చారకొండ వెంకటేష్‌కు రాష్ట్ర ప్రభుత్వం విద్యాకమిషన్ సభ్యులుగా నియమించడంపై సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వెంకటేష్ పీహెచ్‌డీ పూర్తి చేసి, తెలంగాణ ఉద్యమంలో పాత్రను గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని బాబుజగ్జీవన్ భవన్‌లో వెంకటేష్‌ను మండలంలోని బోడబండ తండాకు చెందిన, లంబాడి హక్కుల పోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి లస్కర్‌నాయక్‌తో పాటు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సన్మానించారు. శంకర్ నాయక్, వెంకట్ బంజారా, భరత్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్‌లో నిల్చొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. పలువురు నైవేద్యం సమర్పించి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. దాదాపు 6 వేల మంది భక్తులు హాజరైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నల్లమలలో పెద్దపులి సంచారం వీడియో వైరల్

అమ్రాబాద్: నల్లమల అడవిప్రాంతంలోని ప్రధాన రోడ్డుపై పెద్దపులి సంచరించినట్లు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయింది. ఈ విషయమై ఎఫ్‌డీ రామమూర్తిని వివరణ కోరగా వైరల్ అయిన వీడియో నల్లమల ప్రాంతానికి సంబంధించి కాదని తెలిపారు. అయితే అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్(బీకే) రోడ్డు వెంట పెద్దపులి సంచరిస్తునట్లు వీడియో వైరల్‌కావడంతో ఎఫ్‌బీఓ నాగేష్ ఆధ్వర్యంలో పెద్దపులి జాడల కోసం వెతుకుతున్నట్లు తెలిసింది.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన అంతయ్యగౌడ్, ఊశన్నలు ఇటీవల మృతి చెందారు. ఆదివారం మాజీ ఎంపీ పోతుగంటి రాములు ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థి ఎంపిక



తాడూరు: స్కూల్ గేమ్స్ క్రీడల్లో భాగంగా అండర్‌– 14, అండర్‌– 17 కరాటే పోటీలకు ఆదివారం ఎంపిక చేశారు. మండల కేంద్రానికి చెందిన వై అరవింద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, మాస్టర్ వెంకటస్వామి, సీతారాంలు మండల కేంద్రంలో విద్యార్థిని అభినందించారు.

రెచ్చగొట్టడమే బీఆర్‌ఎస్ నాయకుల పని

మన్ననూర్: ప్రజలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందేందుకు బీఆర్‌ఎస్ నాయకులు యత్నిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ, డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య ఆరోపించారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని విమర్శించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాయకులు అంబనారాయణ, కృష్ణయ్య, తిరుమలయ్య, శివ, రామాంజనేయులు, నిరంజన్, నరహరి, శేఖర్, బాలు రజిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణ, డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య

ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు



మంచాలకట్టలో కృష్ణానదితీరంలో కనువిందు చేస్తున్న ఇంద్రధనస్సు

మండలంలోని మంచాలకట్టలో ఆదివారం సాయంత్రం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. తేలికపాటి వర్షంలో ప్రకృతి సోయగాల మధ్య ఇంద్రధనస్సు ఏర్పడింది. కృష్ణానది తీరాన నల్లమల కొండల మధ్య ఏర్పడిన హరివిల్లును స్థానికులు కెమెరాలలో బంధిస్తూ సందడి చేశారు. అర్ధచంద్రాకారంలో ఇటు పచ్చని చెట్లను స్పృశిస్తూ అటు కృష్ణమ్మ నీటిని ముద్దాడుతూ కనిపించిన దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

–పెంట్లవెల్లి

ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించాలి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుబడిన కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించాలని యువజన కాంగ్రెస్ నాయకులు అన్వర్‌పాషా, శివప్రసాద్‌లు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. నిజమైన కార్యకర్తలు అన్యాయం చేయొద్దని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులను గుర్తించాలని కోరారు.